సాక్షి
నంద్యాల
శనివారం । 12 । ఏప్రిల్ । 2025



ఉప్పొంగిన భక్తిభావం

ఎమ్మిగనూరులో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి రథోత్సవం కనుల పండువగా సాగింది. తమిళ భక్తులు కావళ్లతో, నోటికి శూలాలు గుచ్చుకుని ఉత్సవంలో పాల్గొన్నారు. 10లో▸



సైక్లింగ్‌లో విద్యార్థిని ప్రతిభ

జాతీయ స్థాయి సైక్లింగ్ పోటీల్లో ఓర్వకల్లు మండలం మీదివేముల జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని దివ్యశ్రీ ప్రతిభ కనబరిచింది. పాఠశాలలో విద్యార్థిని శుక్రవారం అభినందించారు. 10లో▸



ఎక్కువ కేసులు పరిష్కరించండి

జాతీయ లోక్‌అదాలత్ మే 10న జరగనుందని, ఎక్కువ కేసులు పరిష్కరించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.కబర్ధి అన్నారు. పోలీసులతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. 10లో▸

ఉద్యోగులను మోసపుచ్చి.. సంఘాలు కప్పిపుచ్చి!

అరచేతిలో వైకుంఠం చూపుతున్న ప్రభుత్వం

- 2024 జనవరి నుంచి వెయ్యి మందికి పైగా పదవీ విరమణ
- ఇప్పటి వరకు ఒక్కరికీ అందని ఆర్థిక ప్రయోజనాలు
- ప్రతి ఉద్యోగికి రూ.40 లక్షలకు పైగా బకాయి
- రెగ్యులర్ ఉద్యోగులకు అందని మూడు సరండర్ లీవ్‌లు
- 11వ పీఆర్‌సీ లేదు.. ఐఆర్ ఊసే లేదు
- ప్రభుత్వం ఏర్పాటయ్యాక మూడు డీఏలు పెండింగ్

కూటమి ప్రభుత్వం ఉద్యోగుల జీవితాలతో ఆడుకుంటోంది. పప్పులు, బెల్లాలు పంచుతూ.. కీలక ప్రయోజనాల విషయంలో మౌనం వహిస్తోంది. పదవీ విరమణ పొందిన ఉద్యోగులు పిల్లల వివాహాలు, ఇంటి నిర్మాణం.. భవిష్యత్ అవసరాలకు దిక్కులు చూడాల్సి వస్తోంది. రెండేళ్లు గడుస్తున్నా వీరి విషయంలో ప్రభుత్వం ఒక్క అడుగు కూడా ముందుకు వేయని పరిస్థితి. ఇక ఉద్యోగుల్లో అసంతృప్తి చాపకింద నీరులా విస్తరిస్తుంటే.. ఉద్యోగ సంఘాలు మాత్రం అరకొర ప్రయోజనాలను తమ విజయంగా చెప్పుకోవడం గమనార్హం.



కర్నూలు(అగ్రికల్చర్): ప్రభుత్వ తీరు పట్ల ఉద్యోగుల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత తమకు ఏదో జరిగిపోతుందని భావించినా.. పది నెలల్లోనే అనుకున్న స్థాయిలో ప్రయోజనాలు లేకపోవడంతో గుర్రుమంటున్నారు. ఉద్యోగులు, పెన్షనర్లకు 1వ తేదీ వేతనాలు, పెన్షన్ ఇవ్వడం మినహా ఆర్థిక ప్రయోజనాలకు మోక్షం లభించని పరిస్థితి. రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులు, పెన్షనర్లకు చెల్లించాల్సిన బకాయిలు దాదాపు రూ.30 వేల కోట్లు ఉండగా.. రెండు నెలల క్రితం రాష్ట్రం మొత్తానికి రూ.1,300 కోట్లు, ఇటీవల రూ.6,200 కోట్లు మాత్రమే విడుదల చేసింది. రూ.6,200 కోట్లలో రూ.2,300 కోట్లు సీపీఎస్ ఉద్యోగుల మ్యాచింగ్ గ్రాంటుకే సరిపోవడం గమనార్హం. ఉమ్మడి జిల్లా విషయానికొస్తే రూ.2వేల కోట్ల బకాయిలు పేరుకుపోయాయి. ఇందులో రూ.300 కోట్లను మాత్రమే ప్రభుత్వం ఇప్పటి వరకు చెల్లించాలి. అధికారంలోకి వచ్చిన తర్వాత కూటమి ప్రభుత్వం ఉద్యోగులకు ఏమైన చేసిందా అంటే ఆరేడు నెలలు పట్టించుకున్న దాఖలాల్లేవు. దీంతో ఉద్యోగుల్లో అసంతృప్తి అధికమవుతుండటంతో సంక్రాంతి సమయంలో రూ.1,300 కోట్లు విడుదల చేసింది. అరకొరగా నిధులు విడుదల చేయడం, బకాయిలు పేరుకుపోతుండటంతో ఉద్యోగుల్లో అసంతృప్తి జ్వాల రగులుతోంది. ఈ నేపథ్యంలో మళ్లీ రూ.6,200 కోట్లు విడుదల చేసింది. ఇందులో ఏపీజీఎల్ఐ బకాయిలకు రూ.1,000 కోట్లు, జీపీఎస్ బకాయిలకు రూ.2,500 కోట్లు, సీపీఎస్ ఉద్యోగుల మ్యాచింగ్ గ్రాంటు కోసం రూ.2,300 కోట్లు సర్దుబాటు చేశారు.

కొండలా విశ్రాంత ఉద్యోగుల బకాయిలు

- ఉమ్మడి కర్నూలు జిల్లాలో 2024 జనవరి నుంచి దాదాపు 1000 మంది ఉద్యోగులు పదవీ విరమణ పొందారు.
- 2024 జనవరి నుంచి జూన్ వరకు పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు పెన్షన్ ప్రపోజల్స్ సిద్ధం కావడంలో ఆలస్యం, ఆలోపే ఎన్నికల కోడ్ రావడంతో ఆర్థిక ప్రయోజనాలు చెల్లించ లేదు.
- చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి 10 నెలలు పూర్తయినప్పటికీ ఆర్థిక ప్రయోజనాల విషయంలో నోరెత్తని పరిస్థితి.
- పదవీ విరమణ చేసిన వారికి పెన్షన్ ఇస్తున్నారు తప్ప మిగిలిన ప్రయోజనాలైన గ్రాట్యూటీ, కమిటేషన్, ఎన్‌క్యాష్‌మెంటు ఎర్న్‌డ్ లీవ్‌లు(10 నెలల వేతనం) పెండింగ్‌లోనే ఉండిపోయాయి.
- ప్రతి ఉద్యోగికి గ్రాట్యూటీ రూ.16 లక్షల నుంచి రూ.20 లక్షలు, కమిటేషన్ రూ.15 లక్షలు, 10 నెలల వేతం క్యాడర్‌ను బట్టి రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షలు చెల్లించాల్సి ఉంది.



ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఇటీవల కలెక్టరేట్ ఎదుట ఉపాధ్యాయుల నిరసన

త్వరలోనే పెద్ద ఎత్తున ఆందోళనలు



ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికుల ఆర్థిక ప్రయోజనాలను చెల్లించడంలో కూటమి ప్రభుత్వం చొరవ చూపడం లేదు. పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు ప్రభుత్వం నుంచి బెనిఫిట్స్ అందక ఇబ్బంది పడుతున్నారు. పెండింగ్‌లో ఉన్న మూడు డీఏల్లో ఒక్కటీ చెల్లించకపోవడం ఎంతవరకు సమంజసం. ఉద్యోగులకు వెంటనే మధ్యంతర భృతి ఇవ్వాలి. పెండింగ్ ఆర్థిక ప్రయోజనాలను రాబట్టుకునేందుకు ఉపాధ్యాయ సంఘాలు ఆందోళనకు సిద్ధమవుతున్నాయి. – హృదయరాజు, రాష్ట్ర అధ్యక్షులు, ఏపీటీఎఫ్

> వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 2024 అసెంబ్లీ ఎన్నికల నాటికి ఎలాంటి డీఏలు పెండింగ్‌లో పెట్టకుండా విడుదల చేసింది. ఉద్యోగుల ఆర్థిక ప్రయోజనాలు కూడా చెల్లించింది.

మూడు సరండర్ లీవ్‌లు బకాయిలే...

ఇటీవల విడుదల చేసిన నిధుల నుంచి ఉద్యోగులకు లభించిన ప్రయోజనం నామమాత్రమే. పోలీసులకు ఐదు సరండర్ లీవ్‌లు పెండింగ్‌లో ఉంటే రెండు మాత్రమే చెల్లించారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులకు మూడు సరండర్ లీవ్‌లు బకాయిలుగా ఉండిపోయాయి. డీఏ అరియర్స్, 10వ పీఆర్‌సీ అరియర్స్ బకాయిలు చెల్లించాల్సి ఉంది. ఉద్యోగుల టీఏ బిల్లులకు మోక్షం ఎప్పుడు లభిస్తుందో తెలియని పరిస్థితి.

ఐఆర్ ఎప్పుడిస్తారో!

కూటమి ప్రభుత్వం వస్తే ఐఆర్ ఇస్తుందని ఆశించిన ఉద్యోగులకు 10 నెలల్లో వాస్తవం అర్థమైంది. 11వ వేతన సవరణకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కమిషన్ ఏర్పాటు చేసింది. ఆ ప్రభుత్వం పడిపోవడంతో దాని ఉనికి కోల్పోయింది. 11వ పీఆర్‌సీ కమిషన్ అలస్యమయ్యే అవకాశం ఉంటే మధ్యంతర భృతి(ఐఆర్) ఇస్తారు. పీఆర్‌సీ కమిషన్ లేకపోతే.. ఐఆర్ ఊసే కరువైంది. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత మూడు డీఏలు పెండింగ్‌లో ఉండిపోయాయి. వీటిని ఎప్పటికీ ఇస్తారనేది ప్రశ్నార్థకం.

న్యూస్‌రీల్

పారదర్శకంగా బదిలీలు చేస్తాం



పోలీసుల సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ

బొమ్మలసత్రం: వివిధ పోలీస్ స్టేషన్లలో పనిచేస్తున్న పోలీసులు బదిలీల కోసం వినతి పత్రాలు ఇచ్చారని, వారిని పారదర్శకంగా స్థానచలనం చేస్తామని ఎస్పీ అధిరాజ్‌సింగ్‌రాణా తెలిపారు. ఎస్పీ కార్యాలయంలో శుక్రవారం గ్రీవెన్స్‌డేను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పోలీసు సిబ్బంది తమ దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను, అలాగే మ్యూచువల్, రిక్వెస్ట్ బదిలీలను, పదోన్నతులను త్వరగా పరిష్కరిస్తామన్నారు. ఎస్బీ సీఐలు మోహన్‌రెడ్డి, సూర్యమౌళి తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీతో వేరుశనగ విత్తన కాయలు

కర్నూలు(అగ్రికల్చర్): వేసవిలో నీటి సదుపాయం కింద వేరుశనగ సాగుకు 50 శాతం సబ్సిడీతో విత్తనం వేరుశనగ కాయలను పంపిణీ చేసేందుకు వ్యవసాయ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలో 2000 హెక్టార్లకు విత్తనాలు పంపిణీ చేస్తారని వ్యవసాయ అధికారులు తెలిపారు. కే-6, టీసీజీఎస్ 1694 రకం వేరుశనగ కిలో పూర్తి ధర రూ.96 ఉండగా సబ్సిడీ రూ.48 ఉంటుంది. కదిరి లేపాక్షి రకం కిలో ధర రూ.85 ఉండగా సబ్సిడీ రూ.42.50 ఉంటుంది. ఇవి 30 కిలోల ప్యాకెట్లలో లభిస్తాయి. గరిష్టంగా రెండు హెక్టార్లకు 10 ప్యాకెట్లు పంపిణీ చేస్తారు. వేసవిలో వేరుశనగ సాగు చేసే రైతులు సంబంధిత వ్యవసాయ అధికారులను సంప్రదించాలి.

నేడు కూడా రిజిస్ట్రేషన్లు

కర్నూలు(సెంట్రల్): రెండో శనివారం సెలవు అయినా స్థలాలను రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చని రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ పీజీ కల్యాణి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు అన్ని పనిచేస్తాయని, అధికారులు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు.

ట్రెజరీల్లో హెల్ప్‌లైన్ నంబర్లు

కర్నూలు(సెంట్రల్): పెన్షన్ సంబంధిత సమస్యల పరిష్కారం కోసం ట్రెజరీల్లో హెల్ప్ నంబర్లను అందుబాటులోకి తెచ్చారు. కర్నూలు జిల్లా ట్రెజరీకి సంబంధించి 6300968380, నంద్యాల జిల్లా ట్రెజరీకి 9849388295 నంబర్లను కేటాయించారు. కర్నూలు, నంద్యాల జిల్లాల సబ్ ట్రెజరీ కార్యాలయాల్లో పెన్షన్ మంజూరు కోసం కొందరు అధికారులు లంచాలు డిమాండ్ చేస్తున్నారని, రిటైర్డ్ ఉద్యోగులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని 'సాక్షి'లో వచ్చిన కథనంపై లోకాయుక్త 2025 ఫిబ్రవరి 7న సుమోటోగా కేసు నమోదు చేసింది. అవినీతి, అక్రమాలను అరికట్టడం, కాలయాపన నిరోధానికి చర్యలు తీసుకోవా లని ఏపీ ట్రెజరీస్ అకౌంట్స్ డైరక్టర్‌కు నోటీసులు పంపింది. అందులో భాగంగా ఏపీ ట్రెజరీస్ అకౌంట్స్ డైరక్టర్ పలు పెన్షనర్ సంఘాలతో సమావేశాలు నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని ట్రెజరీల్లో హెల్ప్‌లైన్ నంబర్లను అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు ఉప లోకాయుక్తకు నివేదిక సమర్పించారు. ఈ నివేదిక శుక్రవారం ఉప లోకాయుక్త జస్టిస్ పి.రజనీకి అందడంతో కేసును మూసి వేస్తున్నట్లు ఆమె ప్రకటించారు. హెల్ప్‌లైన్ నంబర్లతో రిటైర్డ్ ఉద్యోగులు త్వరగా సేవలను పొందేందుకు వీలు ఉంటుందని ఆమె తెలిపారు.

సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిరావు పూలే

నంద్యాల(అర్బన్): సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతికి, మహిళల విద్యాభివృద్ధికి కృషి చేసిన గొప్ప సంఘ సంస్కర్త, మానవతావాది మహాత్మా జ్యోతిరావు పూలే అని రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. బొమ్మలసత్రం సమీపంలో సమీకృత ప్రభుత్వ బీసీ బాలికల వసతి గృహంలో శుక్రవారం మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మహిళలు చదువుకుంటే అసమానతలు తొలగిపోతాయని భావించి మొదట తన సతీమణి సావిత్రీబాయిని విద్యావంతురాలిని చేసిన గొప్ప ఆచరణ వాది జ్యోతిరావు పూలే అన్నారు. సమాజ పునర్నిర్మాణానికి పూలే చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ.. కుల, మత, వర్గ విభేదాలు లేని సమాజం కోసం కృషి చేసిన మహనీయుడు మహాత్మా జ్యోతిరావు పూలే అన్నారు. బీసీ, ఈడబ్ల్యూఎస్, కాపు కార్పొరేషన్ల ద్వారా 514 మంది లబ్ధిదారులకు స్వయం ఉపాధి



మెగా చెక్కును అందజేస్తున్న మంత్రి ఫరూక్, కలెక్టర్ రాజకుమారి

పథకం కింద రూ.12.37 కోట్ల మెగా చెక్కును అందజేశారు. అనంతరం సమీకృత ప్రభుత్వ బీసీ బాలికల వసతి గృహంలో మరమ్మతులు చేసిన టాయిలెట్స్‌ను మంత్రి, జిల్లా కలెక్టర్ పరిశీలించారు. యాదవ, కురవ కార్పొరేషన్ డైరెక్టర్లు వెంకటేశ్వర్లు, రామకృష్ణ జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి ఓబులేసు, బీసీ కార్పొరేషన్ ఈడీ జాకీర్, పలు సంఘాల నాయకులు నాగ శేషుయాదవ్, గోవిందనాయుడు, గుర్రం లక్ష్మి, గౌరి, బోయ రామకృష్ణ పాల్గొన్నారు.

నేడు ఇంటర్ ఫలితాలు

కర్నూలు సిటీ: ఇంటర్మీడియట్ పరీక్షల ఫలితాలను నేడు(శనివారం)విడుదల చేయనున్నారు. గత నెల 1 నుంచి 15వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించారు. మూల్యాంకనం గత నెల 17న మొదలై ఈ నెల 3వ తేదీతో ముగిసింది. ఫలితాల కోసం https://resultsbie.ap.gov.in అనే వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చు. 9552300009 అనే నెంబర్‌కు మెసేజ్ పెడితే ఫలితాలు రానున్నాయి.

డీఈఓ కార్యాలయం ఏడీ సస్పెన్షన్

కర్నూలు సిటీ: మహిళా ఉద్యోగులను వేధింపులకు గురి చేస్తున్నారనే ఆరోపణలతో జిల్లా విద్యాశాఖ కార్యాలయం అసిస్టెంట్ డైరెక్టర్‌ను సస్పెండ్ చేస్తూ పాఠశాల విద్య డైరెక్టర్ విజయ రామరాజు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. అసిస్టెంట్ డైరెక్టర్-1గా పని చేస్తున్న వి.శ్రీనివాసులు మహిళా ఉద్యోగులను వేధింపులకు గురి చేస్తున్నట్లు ఫిర్యాదులు రావడంతో ఇటీవల ఆర్జేడీ శామ్యూల్ విచారణ చేపట్టారు.

'సాక్షి'పై ప్రభుత్వ కక్ష సాధింపు



జిల్లా కలెక్టర్ రాజకుమారికి వినతిపత్రం అందజేస్తున్న ఏపీయూడబ్ల్యూజే, ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకులు

- కలెక్టరేట్ ఎదుట జర్నలిస్టుల నిరసన

నంద్యాల: సాక్షి దినపత్రికలో ప్రచురితమైన వార్తపై నిజానిజాలు నిర్ధారించుకోకుండా రాష్ట్ర ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతూ సాక్షి ఎడిటర్ ఆర్ ధనంజయరెడ్డితో పాటు ఆరుగురు విలేకరులపై కేసులు నమోదు చేయడం సిగ్గు చేటని జర్నలిస్టులు అన్నారు. ఏపీయూడబ్ల్యూజే, ఏపీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట శుక్రవారం జర్నలిస్టులు నిరసన తెలిపారు. సాక్షి ఎడిటర్ ఆర్ ధనంజయరెడ్డి, మరో ఆరుగురు విలేకరులపై అక్రమంగా పెట్టిన కేసులను వెంటనే ఎత్తి వేయాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ రాజకుమారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ మౌలాలి మాట్లాడుతూ.. జర్నలిస్టులపై రాష్ట్ర ప్రభుత్వం తప్పుడు కేసులు పెట్టడాన్ని నిరశిస్తున్నామన్నారు. ఈ నెల 3వ తేదీ పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గం పశువేముల గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త హరిశ్చంద్ర టీడీపీ మూకల చేతిలో దారుణ హత్యకు గురయ్యారని, ఇందుకు సంబంధించిన వార్త సాక్షి దిన పత్రికలో ప్రచురితం అయ్యిందన్నారు. దీనిపై నిజానిజాలు నిర్ధారించుకోకుండా సాక్షి ఎడిటర్ ఆర్ ధనంజయరెడ్డితో పాటు ఆరుగురు విలేకరులపై ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతూ కేసులు నమోదు చేయడం సిగ్గు చేటన్నారు. ఈ ఘటనను జర్నలిస్టులంతా తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని తప్పుడు కేసులను రద్దు చేయడంతో పాటు భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతమవకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. నిరసనలో ఏపీయూడబ్ల్యూజే జిల్లా ఉపాధ్యక్షుడు బాలమద్దిలేటి, జర్నలిస్టులు హరినాథరెడ్డి, ఎస్కే బాలునాయక్, గిరిబాబుసాగర్, దస్తగిరి, చంద్రవరప్రసాద్, అబ్దుల్‌కరీం, మోహన్, హుసేన్‌బాషా, రాము తదితరులు పాల్గొన్నారు.



గ్రామోత్సవంలో ఉత్సవమూర్తులు

పంగుని ఉతిరం.. వైభవోపేతం

ఆళ్లగడ్డ: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అహోబిలంలో పంగుని ఉతిరం వేడుకలు శుక్రవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం ఉత్సవమూర్తులైన శ్రీదేవి, భూదేవి సమేత ప్రహ్లాదవరదస్వామి, గోదాదేవి అమ్మవార్లకు తిరుమంజన సేవ చేశారు. అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. రాత్రి పల్లకీలో కొలువైన ఉత్సవమూర్తులకు మాడవీధుల్లో వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు.

అన్ని వేళలా.. అంతటా గ'మ్మత్తు'

- జిల్లాలో ఏరులై పారుతున్న మద్యం
- ప్రతి రోజూ 24 గంటల పాటు విక్రయాలు
- నిబంధనలకు విరుద్ధంగా బెల్టు దుకాణాల ఏర్పాటు
- బడి, గుడి ఉన్న ప్రాంతాల్లోనూ మద్యం విక్రయాలు
- మహానంది, ఆహోబిల క్షేత్రాల పరిధిలోనూ 'బెల్టు' భూతం
- డోన్, గోస్పాడు మండల కేంద్రాల్లో మద్యం డోర్ డెలివరీ
- మద్యం బేరంపై 'కూటమి' నేతల మధ్య నిత్యం రగడ



నంద్యాలలో ఓ వైన్‌షాప్ వద్ద అక్రమంగా ఏర్పాటు చేసిన పర్మిట్‌రూమ్

బొమ్మలసత్రం: జిల్లాలో ఊరూరా మద్యం ఏరులై పారుతోంది. పాఠశాలలు ఉన్న ప్రాంతాలను, ప్రముఖ పుణ్య క్షేత్రాలు ఉన్న పట్టణాలను సైతం 'కూటమి' నేతలు వదలడం లేదు. నిబంధనలకు విరుద్ధంగా బెల్టు దుకాణాలు ఏర్పాటు చేసుకుని మద్యం విక్రయాలు సాగిస్తున్నారు. ప్రతి రోజూ తెల్లవారుజాము నుంచి అర్ధరాత్రి వరకు వ్యాపారాలు సాగిస్తున్నారు. ఆహోబిలం క్షేత్రంలో ఏకంగా మూడు బెల్టు దుకాణాలను 'కూటమి' నేతలు నడుపుతున్నారు. ఈ దుకాణాలు ఏర్పాటు చేసుకున్న వారు పాలకులకు నేరుగా రూ. 6 లక్షలు ముట్టచెప్పినట్లు స్థానికులు గుసగుసలాడుకుంటున్నారు. మహానంది దేవాలయానికి వెళ్లే మార్గంలో ఒక కూల్‌డ్రింక్ దుకాణంలో మద్యం విక్రయాలు బాహాటంగా సాగుతున్నాయి. హిందూ దేవాలయాల పవిత్రతను దెబ్బ తీసేలా 'కూటమి' నేతలు వ్యవహరించటంపై విమర్శలు వస్తున్నాయి. నందికొట్కూరు మండలం బ్రాహ్మణకొట్కూరు గ్రామంలో జెడ్పీ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ బాలుర వసతి గృహం సమీపంలో మద్యం దుకాణం ఏర్పాటు చేయడంతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇలా చేసింది..

- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రభుత్వ మద్యం దుకాణం వద్ద ఎవరైనా మద్యం సేవించాలంటే భయపడిపోయేవారు. నిత్యం సెబ్, పోలీస్ అధికారులు పర్యవేక్షణ ఉండేది.
- ఎక్కడా బెల్టుషాపులు కనిపించేవి కాదు.
- నాటుసారా వ్యాపారులపై పోలీసులు పీడీయాక్ట్ నమోదు చేసేవారు.
- జనావాసాలకు దూరంగా మద్యం దుకాణాలు ఉండేవి.
- ఆలయాలు ఉండే ప్రాంతాల్లో, పాఠశాలల సమీపంలో మద్యం విక్రయాలు కనిపించేవి కాదు.

కూటమి ప్రభుత్వం వచ్చాక ఇలా..

- ఎక్కడ చూసినా 'కూటమి' నేతల మద్యం దుకాణాలే కనిపిస్తున్నాయి. వైన్‌షాప్‌ల వద్దే మద్యం తాగేందుకు వీలుగా అన్ని సదుపాయాలు కల్పిస్తున్నారు.



గోస్పాడు మండల కేంద్రంలోని బెల్టు దుకాణంలో ఏర్పాటు చేసిన పర్మిట్‌రూమ్

- ఆదాయం కోసం ఎక్కడ పడితే అక్కడ వైన్‌షాపుల ఏర్పాటుకు ప్రభుత్వం లైసెన్స్ జారీ చేసింది.
- జిల్లాలో ప్రస్తుతం కల్లుగీత కార్మికులకు కేటాయించిన 11 మద్యం దుకాణాలతో కలుపుకొని 116 వైన్‌షాపులు, 22 బార్ అండ్ రెస్టారెంట్‌లు ఉన్నాయి.
- నంద్యాల పట్టణంలో ఒక హోటల్ పక్కనే ఉన్న బార్ అండ్ రెస్టారెంట్ మొదలుకొని పద్మావతి నగర్‌లో ప్రముఖ దేవాతామూర్తి పేరుమీద ఉన్న వైన్ షాప్‌లలో వేకువజామున నుంచి విక్రయాలు మొదలవుతాయి. రాత్రి 12 దాటిన తర్వాత కూడా అక్కడ మద్యం దొరుకుతుందంటే యజమానుల ధనదాహం ఏరీతిలో ఉందో ఇట్టే అర్థమవుతుంది.
- కొలిమిగుండ్ల మండలం కల్వటాల గ్రామంలో కొందరు 'కూటమి' నేతలు బెల్టు దుకాణాలను ఏర్పాటు చేశారు. ఫోన్ కాల్ చేస్తే చాలు అక్కడికే మద్యం, వాటర్ పాకెట్లు, స్నాక్స్ తీసుకుని వెళ్తారు. ఈ వింతను చూసి ముక్కున వేలేసుకుంటున్నారు.

పోటాపోటీగా బెల్టు దుకాణాలు

జిల్లాలో మొత్తం 29 మండలాల్లో 449 గ్రామాలు ఉన్నాయి. రాష్ట్రంలో 'కూటమి' ప్రభుత్వం రాగానే గతంలో మూతపడిన బెల్టు దుకాణాలు, నాటుసారా స్థావరాలు గ్రామాల్లో తిరిగి తెరుచుకున్నాయి. స్థానిక టీడీపీ నేతకు రూ. 2 లక్షల వరకు ఇచ్చి బెల్టు దుకాణాలను నడిపిస్తున్నారు. పోలీసులు దాడి చేయకుండా టీడీపీ నాయకులే అడ్డుతున్నారు. నంద్యాల నియోజకవర్గం గోస్పాడు మండలంలో ఇద్దరు టీడీపీ నాయకులు పోటాపోటీగా బెల్టు దుకాణాలు నడుపుతున్నారు.

'పర్మిట్'.. గప్‌చిప్!

జిల్లాలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 93 ప్రభుత్వ మద్యం దుకాణాలు మాత్రమే ఉండేవి. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఆదాయం కోసం ఆసంఖ్యను 116కు పెంచింది. వైన్‌షాపుల వద్దే పర్మిట్ గదులు ఏర్పాటు చేసి మద్యం తాగిస్తున్నారు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రుద్రవరం మండలం ఆలమూరు, ఆళ్లగడ్డ మండలం మిట్టపల్లి, గోస్పాడు మండలం ఎం.క్రిష్టాపురం గ్రామాల్లో బెల్ట్ షాపులు ఉన్నాయని ప్రజలే ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఇళ్ల మధ్యన మద్యం దుకాణాలు వద్దని, ఊరికి దూరంగా ఏర్పాటు చేయించాలని జూపాడు బంగ్లాలో ప్రజలు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఇవే కాకుండా... బండిఆత్మకూరు మండలంలోని వెంగళరెడ్డి పేటకు చెందిన ఓ వ్యక్తి గ్రామంలోనే మద్యం తాగేవాడు. మహిళలను అసభ్యంగా ప్రవర్తించే వాడు. స్థానికుల ఫిర్యాదుతో పోలీసులు అతన్ని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచగా జడ్జి జైలు శిక్ష విధించారు. జిల్లా కేంద్రమైన నంద్యాలలో ఎక్సైజ్ అధికారులకు కూత వేటు దూరంలో వైన్ షాప్‌ను 'బార్'గా చేశారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు.

క్లుప్తంగా

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

బండి ఆత్మకూరు: ఏ కోడూరు గ్రామంలో ఇంటర్ విద్యార్థి బిజ్జం వెంకట సుధీశ్వర్‌రెడ్డి (16) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ జగన్‌మోహన్ తెలిపిన వివరాల మేరకు.. ఇటీవల ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం పరీక్షలు రాసిన విద్యార్థి శని వారం ఫలితాలు వెలువడుతున్న తరుణంలో తీవ్ర ఆందోళన చెందాడు. ఈ మేరకు శుక్రవారం ఇంట్లో ఉరేసుకుని మృతి చెందాడు. విద్యార్థి తండ్రి వెంకట సుబ్బారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

5 వరకు పీజీసెట్ దరఖాస్తుల స్వీకరణ

కర్నూలు(సెంట్రల్): రాష్ట్రవ్యాప్తంగా ఉన్న విశ్వ విద్యాలయాలు, డిగ్రీ, పీజీ కాలేజీల్లోని కోర్సుల్లో ప్రవేశం కోసం నిర్వహించే ఏపీ పీజీ సెట్–2025 నోటిఫికేషన్ విడుదలైంది. మే 5వ తేదీ వరకు ఎలాంటి ఆలస్య రుసుం చెల్లించకుండా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని ఆర్‌యూ రిజిస్ట్రార్ బి.విజయకుమార్, అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీ ఇన్‌చార్జ్ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ పీఎస్‌షావలీఖాన్ శుక్రవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. జూన్ 09 నుంచి 13వ తేదీ వరకు ప్రవేశ పరీక్షలు జరుగుతాయన్నారు. డిగ్రీ పూర్తి చేసిన చేసినవారు, చివరి సెమిష్టర్ పరీక్షలు రాసిన అభ్యర్థులు అర్హులని, మరిన్ని వివరాల కోసం www. rujo.ac.in, www. cets, apsche.ap.gov.inను సందర్శించాలన్నారు.

డ్రైవర్ దుర్మరణం

కర్నూలు: కర్నూలు శివారులోని తుంగభద్ర బ్రిడ్జి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎస్‌ఆర్ఎంటీలో డ్రైవర్‌గా పనిచేస్తున్న గిరీశ్వర్ రెడ్డి (40) మృతి చెందాడు. కల్లూరు మండలం పెద్దపాడు గ్రామానికి చెందిన ఈయన ప్రస్తుతం కర్నూలు గణేష్ నగర్‌లో నివాసముంటూ ఎస్‌ఆర్ఎంటీ వాహనానికి డ్రైవర్‌గా పని చేస్తూ జీవనం సాగించేవాడు. గురువారం రాత్రి సొంత పని మీద ద్విచక్ర వాహనంపై కర్నూలు మండలం పంచలింగాల గ్రామానికి వెళ్లి తిరిగి కర్నూలుకు బయలుదేరాడు. కాగా హంద్రీ బ్రిడ్జి వద్ద హైదరాబాదు–బెంగళూరు జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వ్యక్తి అదుపు తప్పి కింద పడ్డాడు. గమనించిన గిరీశ్వర్ రెడ్డి తన బైక్‌ను పక్కకు ఆపి పరిగెత్తుకుంటూ వెళ్లి రోడ్డుపై పడివున్న వ్యక్తిని (అతను కూడా డ్రైవరే) పైకి లేపి పంపించాడు. ఆ తర్వాత తన వాహనం దగ్గరకు వెళ్లేందుకు గిరీశ్వర్ రెడ్డి రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని కారు వేగంగా వచ్చి ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈయనకు భార్య మహాలక్ష్మితో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కర్నూలు అర్బన్ తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

కర్నూలు: కర్నూలు బళ్లారి చౌరస్తా సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. స్థానిక లక్ష్మీనగర్‌లోని గౌసియా కాంప్లెక్స్‌లో నివాసముంటున్న సందీప్ (18) ఏపీఎస్పీ రెండో బెటాలియన్ షాపింగ్ కాంప్లెక్స్‌లోని ఓ పెయింట్ దుకాణంలో గుమాస్తాగా పని చేస్తున్నాడు. కల్లూరు ఎస్టేట్‌లో ఉన్న గోడౌన్‌లో ఉన్న స్టాక్‌ను తెచ్చేందుకు గురువారం రాత్రి ఆటోలో బయలుదేరాడు. కృష్ణానగర్ వైపు వెళ్లే సర్వీస్ రోడ్డులో సంపత్ నగర్‌లోని అపోలో టైర్ షాపు వద్ద హైదరాబాదు నుంచి బెంగళూరు వెళ్లే కారు వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ పుల్లయ్య స్వల్ప గాయాలతో బయటపడగా ఆటోలో కూర్చున్న సందీప్‌కు ఛాతీపై బలమైన గాయాలయ్యాయి. ఆటో కూడా పూర్తిగా ధ్వంసమైంది. మరో ఆటోలో వీరిని ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స చేయించగా సందీప్ కోలుకోలేక శుక్రవారం తెల్లవారుజామున మృతిచెందాడు. మృతుడి తల్లి వరలక్ష్మి ఆసుపత్రిలో ఆయాగా పనిచేస్తోంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రిలోని మార్చురీ కేంద్రానికి తరలించి ఆటోడ్రైవర్ పుల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

ఒలింపిక్స్‌లో షేక్ జఫ్రీన్ రాణించాలి

● జాయింట్ కలెక్టర్ నవ్య



షేక్ జఫ్రీన్‌ను సత్కరిస్తున్న జేసీ నవ్య, డీసీసీబీ అధికారులు

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు డివిజన్ కో– ఆపరేటివ్ అధికారిణిగా విధులు నిర్వహిస్తున్న షేక్ జఫ్రీన్ ఈ ఏడాదిలో జరిగే ఒలింపిక్స్ పోటీల్లో బంగారు పతకం సాధించాలని జాయింట్ కలెక్టర్ నవ్య ఆకాంక్షించారు. గత నెల 20 నుంచి 23 వరకు గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాద్‌లో జరిగిన నేషనల్ గేమ్స్ (నేషనల్ డెఫ్ సీనియర్ టెన్నిస్ చాంపియన్ షిప్–2025)లో రెండు బంగారు పతకాలు సాధించిన షేక్ జఫ్రీన్‌ను అభినందించారు. శుక్రవారం సాయంత్రం జిల్లా సహకార కేంద్రబ్యాంకులో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జేసీ, డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జ్ కమిటీ చైర్‌పర్సన్ నవ్య హాజరై ప్రసంగించారు. సహకార శాఖలో కర్నూలు డివిజన్ అధికారిగా జఫ్రీన్ సమర్థవంతంగా బాధ్యతలు నిర్వహిస్తూనే నేషనల్ గేమ్స్‌లో కూడా ప్రతిభ కనబరచడం హర్షనీయమన్నారు. ఒలింపిక్స్‌లో రాణించేందుకు అన్ని విధాలా సహకరిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి ఎస్.రామాంజనేయులు, డీసీసీబీ సీఈవో విజయకుమార్, జనరల్ మేనేజర్ పి.రామాంజనేయులు, డీజీఎంలు ఉమామహేశ్వరరెడ్డి, సునీల్‌కుమార్, నాగిరెడ్డి, ఏజీఎంలు త్రినాథ్‌రెడ్డి, గీత, షేక్ జాఫ్రిన్ తండ్రి జాకీర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్ జయంతిపై చిన్నచూపు తగదు

కర్నూలు(అర్బన్): బంజారా జాతి కుల దైవమైన సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించకుండా చిన్న చూపు చూడడం బాధాకరమని లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు ఆర్ కైలాస్‌నాయక్ ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక ఎల్‌హెచ్‌పీఎస్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలోని 15 కోట్ల జనాభా కలిగిన బంజారా తెగలకు మార్గదర్శకులైన సేవాలాల్ జయంతిని ఫిబ్రవరి 14, 15వ తేదీల్లో దేశంలోని అన్ని రాష్ట్రాల్లో అధికారికంగా నిర్వహిస్తున్నారన్నారు. మన రాష్ట్రంలో మాత్రం అధికారికంగా నిర్వహించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వడ్డె ఓబన్న, ఉయ్యాలవాడ నరసింహారెడ్డి, పుట్టపర్తి నారాయణాచార్యులు, జగ్జీవన్‌రామ్, డా.బాబా సాహెబ్ అంబేద్కర్, అల్లూరి సీతారామరాజు, మహర్షి వాల్మీకి తదితర ప్రముఖుల జయంతి, వర్ధంతులను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్న ప్రభుత్వం సేవాలాల్ జయంతిని విస్మరించడం బంజారాల మనోభావాలను దెబ్బతీయడమేనన్నారు. సమావేశంలో నాయకులు ఎస్ నాగరాజు నాయక్, దేవావత్ శంకర్‌నాయక్ పాల్గొన్నారు.



కుమార్తెను చంకనెత్తుకొని వాటర్ బబుల్ గన్స్ విక్రయిస్తున్న మహిళ



కుమారుడితో కలిసి విక్రయాలు

గాలిబుడగ జీవితం.. బతుకు నిత్య పోరాటం!

చంకలో చిన్న పిల్లలు..చేతిలో నీటి బుడగల గన్స్.. ఒకవైపు పిల్లలను ఆడిస్తూ, ఓదారుస్తున్నారు. ఇదే సమయంలో చిరు వ్యాపారం చేస్తూ ఆత్మాభిమానం చాటుతున్నారు. రోజూ నగరంలో ఎంతో మంది అన్ని అవయవాలు బాగున్నా రోడ్లలో బిచ్చమెత్తుకుంటున్న దృశ్యాలు కోకొల్లలు. ఎలాగోలా బతికేస్తున్నామని కాకుండా, ఎంతో కొంత కష్టపడి సంపాదించిన సొమ్ముతో గంజినీళ్లు తాగినా ఆత్మసంతృప్తి ఉంటుందనేందుకు వీళ్లే ఉదాహరణ. రాజస్థాన్‌వాసులు కిలోమీటర్ల దూరం ప్రయాణించి నగరంలోని రద్దీ ప్రాంతాల్లో వాటర్ బబుల్ గన్స్ విక్రయిస్తున్నారు. పెద్ద దుకాణాల్లో జీఎస్టీలు చెల్లించి, నిర్ణయించిన ధరకు కొనుగోలు చేస్తున్న వాళ్లలో సగం మందైనా ఇలాంటి వాళ్లను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు



బబుల్ గన్స్ పనితీరును ప్రదర్శిస్తున్న మహిళ

మదిరెలో సామూహిక వివాహాలు



నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న మఠం పీఠాధిపతి

కౌతాళం: మదిరె గ్రామంలోని ఉటగనూరు తాత మఠంలో శుక్రవారం 25 సామూహిక వివాహా లను మఠం ధర్మకర్త పంపారెడ్డి తాత, గ్రామస్తుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన హచ్చోళ్లి మఠం పీఠాధిపతి రుద్రముని స్వామి మాట్లాడుతూ ఏటా సామూహిక వివాహలు నిర్వహించడంతో పాటు వధూవరులకు దుస్తులు, తాళిబొట్లతో పాటు ముక్కపుడకలు ఇవ్వడం అభినందనీయమన్నారు. ఉటగనూరు మఠం ధర్మకర్త పంపారెడ్డి తాత మాట్లాడుతూ ఏటా దాతలు, గ్రామస్తుల సహకారంతో పేద జంటలకు వివాహాలు జరపడం సంతోషంగా ఉందన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల మృతి



మృతిచెందిన హర్షవర్ధన్ నాయుడు, జయరాజు

కోడుమూరు రూరల్/గోనెగండ్ల: పులకుర్తి – గూడూ రు రోడ్డులో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు దుర్మరణం చెందారు. గోనెగండ్ల మండలం ఆలువాల గ్రామానికి చెందిన బోయ నాగేంద్ర కుమారుడు హర్షవర్ధన్‌నాయుడు (20), ఇదే గ్రామానికి చెందిన జయరాజు(25) సొంత పనుల నిమిత్తం బైక్‌పై గూడూరుకు వెళ్లారు. పనులు ముగించుకుని సాయంత్రం తమ స్వగ్రామానికి తిరిగి వెళ్తుండగా మార్గమధ్యలో పులకుర్తికి 2 కి.మీ దూరంలో గూడూరు వైపు వెళ్తున్న ఆటో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో హర్షవర్ధన్‌నాయుడు అక్కడికక్కడే మృతిచెందగా, తీవ్రంగా గాయపడిన జయరాజును చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. గ్రామానికి చెందిన నాగేంద్ర, శంకరమ్మ దంపతులకు కుమార్తె, కుమారుడు హర్షవర్ధన్ ఉన్నారు. ఈ దంపతులు ఇటీవల కుమారుడితో కలసి వలస వెళ్లారు. కాగా మూడు రోజుల క్రితం హర్షవర్ధన్ స్వగ్రామానికి చేరుకుని శుక్రవారం రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడ్డాడు. మృతుడి మరణ వార్త తెలుసుకున్న తల్లిదండ్రులు స్వగ్రా మానికి బయలుదేరారు. అలాగే టిప్పర్ డ్రైవర్‌గా పని చేసే జయరాజుకు భార్య సజ్జీవతో మూడేళ్లలోపు ఇద్దరు కుమారులు ఉన్నారు. గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు ఒకే రోజు చనిపోవడంతో ఆలువాల గ్రామంలో తీవ్ర విషాదం అలుముకుంది. కోడుమూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇరు కుటుంబాల ఘర్షణ

● అస్వస్థతకు గురైన వ్యక్తి మృతి



నాగరాజు (ఫైల్)

ఓర్వకల్లు: ఇళ్ల ముందు మురుగు కాల్వ విషయంలో జరిగిన ఘర్షణలో అస్వస్థతకు గురైన వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన నన్నూరు గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన బోయ అల్లినగరం నా గరాజు (48) అనే వ్యక్తి తన ఇంటి ముందు వున్న మురుగు కాల్వ నుంచి దుర్వాసన రావడంతో బండతో మూసేశాడు. దీంతో పై వైపు వున్న బోయ బట్టి వెంకటరాముడు బండ ఎందుకు వేశావని .. నాగరాజును నిలదీశాడు. ఈ విషయంలో ఇరు కుటుంబాల మధ్య వాగ్వాదం చోటుచేసుకోంది. ఆ తర్వాత బయటి నుంచి వచ్చిన నాగరాజు కొడుకు మహేంద్ర విషయం తెలుసుకుని వెంకటరాముడిని నిలదీయడంతో వారి మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. స్థానికులు ఇరు కుటుంబాలకు నచ్చచెప్పారు. అయితే మానసిక ఒత్తిడికి లోనైన నాగరాజు అస్వస్థతకు గురై ఒక్కసారిగా స్పృహకోల్పోయి కింద పడ్డాడు. దీంతో చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న పోలీసులు గ్రామానికి చేరుకొని పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు ఇరు కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయలేదని పోలీసులు పేర్కొన్నారు.

గొర్రెల కాపరి ఆత్మహత్య



మృతుడు తలారి లక్ష్మన్న(ఫైల్)

దేవనకొండ: మండల కేంద్రమైన దేవనకొండకు చెందిన గొర్రెల కాపరి తలారి లక్ష్మన్న(41) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు.. రెండు నెలల నుంచి తలారి లక్ష్మన్న విపరీతమైన కడుపునొప్పితో బాధపడుతున్నాడు. అలాగే గొర్రె పిల్లలు కొనేందుకు రూ.5 లక్షలు అప్పు చేశాడు. ఒకవైపు అనారోగ్యం, మరోవైపు అప్పుల బాధ తాళలేక తీవ్ర మనస్తాపానికి గురై జీవితంపై విరక్తి చెంది శుక్రవారం తెల్లవారుజామున భైరవకుంట గ్రామ సమీపంలో వేపచెట్టుకు ఉరి వేసుకున్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వంశీనాథ్ తెలిపారు.

క్రెడిట్ కార్డు లావాదేవీలపై విచారణ

వెలుగోడు: స్నేహితులు, సమీప బంధువుల పేరిట క్రెడిట్ కార్డులు పొంది వాటి ద్వారా లావాదేవీలు జరిపిన యువకుడిని ఆత్మకూరు సీఐ సురేష్‌కుమార్‌రెడ్డి విచారణ చేశారు. వెలుగోడుకు చెందిన తన్వీర్ అనే యువకుడు మొబైల్ దుకాణం, ప్రొక్లెయిన్ నడుపుతూ పలువురి పేర్లపై క్రెడిట్ కార్డు, లోన్ యాప్‌ల నుంచి దాదాపు రూ. 50 లక్షల వరకు లావాదేవీలు జరిపినట్లు సమాచారం. కాగా ఈఎంఐలు సరిగా చెల్లించకపోవడంతో బ్యాంక్ ఉద్యోగులు ఆరా తీయడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. అలాగే బాధితులకు సమాచారం ఇచ్చారు. బాధితులు పోలీసులను ఆశ్రయించడంతో శుక్రవారం ఆత్మకూరు సీఐ సురేష్ కుమార్‌రెడ్డి వెలుగోడుకు చేరుకుని తన్వీర్‌ను విచారించారు. అయితే యువకుడు అక్రమాలకు పాల్పడలేదని వారి బంధువులు, మిత్రుల సహకారంతో క్రెడిట్ కార్డులతో రుణాలు తీసుకుని లావాదేవీలు జరుపుతున్నాడన్నారు. ప్రస్తుతానికి రూ 11,50,000 చెల్లించాల్సి ఉందన్నారు. వారం రోజుల్లో రుణాలు చెల్లించి క్రెడిట్ కార్డులను ఇచ్చేస్తానని తన్వీర్ పోలీసుల ఎదుట ఒప్పుకోవడంతో బాధితులు సైతం సరైన అంటూ వెళ్లిపోయారు.

పట్టపగలే చోరీ

ఆదోని అర్బన్: స్థానిక రాజీవ్‌గాంధీ కాలనీ సమీపంలోని జంగాల కాలనీలో నివాసముంటున్న గోపాల్, రాధ దంపతుల ఇంట్లో శుక్రవారం పట్టపగలే చోరీ జరిగింది. దంపతులిద్దరూ ఉదయం పనుల కోసం ఇంటికి తాళాలు వేసి వెళ్లారు. మధ్యాహ్నం భోజనానికి తిరిగి ఇంటికి వచ్చేలోగా చోరీ జరిగింది. బీరువాలో ఉన్న తులం బంగారం, రూ.7 వేలు నగదు, 30 తులాల వెండి చోరీకి గురైందని బాధితులు తెలిపారు. వెంటనే టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

తుంగభద్రలో మహిళ మృతదేహం

కర్నూలు: స్థానిక రోజా వీధి శివారులో తుంగభద్ర నదిలో గుర్తు తెలియని మహిళ మృతదేహం బయటపడింది. సమాచారం మేరకు రెండో పట్టణ పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని నీటిలో నుంచి వెలికితీశారు. ఆమె చేతిపై సూరయ్య రేణుక అనే పచ్చబొట్టు ఉంది. మొహం ఉబ్బిపోయి గుర్తు పట్టలేని విధంగా ఉంది. ఎర్రటి పూల డిజైన్ గల పంజాబీ డ్రస్సు, నల్లటి లోయర్ (ప్యాంటు) ధరించింది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రిలోని మార్చురీ కేంద్రానికి తరలించారు. ఆచూకీ తెలిసినవారు 9121101060కు సమాచారమివ్వాలని రెండో పట్టణ సీఐ నాగరాజరావు సూచించారు.

జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కరించండి



మాట్లాడుతున్న న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకటశేషాద్రి

కర్నూలు: జాతీయ లోక్ అదాలత్‌లో వీలైనన్ని ఎక్కువ కేసులు పరిష్కరించేలా పోలీసు అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.కబర్థి కోరారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు కర్నూలు న్యాయ సేవా సదన్‌లో శుక్రవారం కర్నూలు పోలీసు అధికారులతో కబర్థి జాతీయ లోక్ అదాలత్‌పై సమీక్ష సమావేశం నిర్వహించారు. మే 10వ తేదీన జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో వీలైనన్ని ఎక్కువ కేసులు పరిష్కారించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్సైజ్ మెజిస్ట్రేట్ సరోజమ్మ మాట్లాడుతూ రాజీ అయ్యే కేసులన్నీ ప్రతిరోజూ కోర్టుకు తీసుకురావాలని సూచించారు. ట్రైనీ మెజిస్ట్రేట్‌లు లక్ష్మి కర్రి హేమ, అపర్ణ, కర్నూలు డీఎస్పీ బాబు ప్రసాద్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుధీర్ బాబు, అసిస్టెంట్ సూపరింటెండెంట్ రామకృష్ణారెడ్డి, ఎక్సైజ్ సీఐలు రాజేంద్ర ప్రసాద్, చంద్రహాస్, సివిల్ సీఐలు రామయ్య నాయుడు, నాగరాజరావు, శేషయ్య, మధుసూదన్ గౌడ్, శ్రీధర్‌తో పాటు పలువురు ఎస్ఐలు కార్యక్రమంలో పాల్గొన్నారు. జిల్లాలోని అన్ని న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న రాజీ అయ్యే సివిల్, క్రిమినల్, ప్రీ లిటిగేషన్ కేసులు పరిష్కరించుకోవాలని కబర్థి, లీలా వెంకటశేషాద్రి ఈ సందర్భంగా పోలీసు అధికారులకు సూచించారు. కక్షిదారులందరూ ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని తమ కేసులను రాజీ పూర్వకంగా పరిష్కరించుకోవాలన్నారు.

సివిల్ పోలీసుల సహకారం తీసుకోండి

● ఎక్సైజ్ అధికారులకు నోడల్ అధికారి శ్రీదేవి ఆదేశం



ఎక్సైజ్ నేరాలపై సమీక్షిస్తున్న డిప్యూటీ కమిషనర్ పి.శ్రీదేవి

కర్నూలు: జిల్లాలో నాటుసారాను సమూలంగా నిర్మూలించడానికి నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా సివిల్ పోలీసుల సహకారం కూడా తీసుకోవాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ నోడల్ అధికారి పి.శ్రీదేవి ఆ శాఖ క్షేత్రస్థాయి అధికారులకు సూచించారు. స్థానిక డిప్యూటీ కమిషనర్ కార్యాలయంలో శుక్రవారం ఉమ్మడి జిల్లా ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్లతో ఆమె నెలవారీ సమీక్ష నిర్వహించారు. నాటుసారాను సమూలంగా నిర్మూలించడానికి నవోదయం 2.0 రెండవ దశ అయిన ఎన్‌ఫోర్స్‌మెంట్ అమలులో భాగంగా సారా అమ్మకం, తయారీ, రవాణాదారులతో పాటు బెల్లం సరఫరాదారులపై కూడా కేసులు నమోదు చేసి బైండోవర్ చేయాలని సూచించారు. నవోదయంను జిల్లాలో పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. ప్రతి కానిస్టేబుల్‌కు పరిధిని నిర్ణయించి వారు బీట్లు సరిగా నిర్వర్తించే విధంగా చూడాలన్నారు. కర్ణాటక, తెలంగాణ నుంచి వస్తున్న సుంకం చెల్లించని మద్యాన్ని అరికట్టాలని ఆదేశించారు. సమావేశంలో ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ రావిపాటి హనుమంత రావు, కర్నూలు, నంద్యాల జిల్లాల ఎక్సైజ్ అధికారులు మచ్చా సుధీర్ బాబు, రవికుమార్, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్లు రామకృష్ణారెడ్డి, రాముడు, రాజశేఖర్ గౌడ్‌తో పాటు ఉమ్మడి జిల్లాల సీఐలు పాల్గొన్నారు.

జాతీయస్థాయి సైక్లింగ్‌లో విద్యార్థిని ప్రతిభ



విద్యార్థినికి సర్టిఫికెట్‌ను అందజేస్తున్న హెచ్ఎం శ్రీనివాసయాదవ్

ఓర్వకల్లు: మీదివేముల జెడ్పీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థిని తంబళ్ల దివ్యశ్రీ జాతీయ స్థాయి సైక్లింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచింది. ఈ మేరకు శుక్రవారం స్థానిక పాఠశాలలో విద్యార్థిని అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం శ్రీనివాసయాదవ్ మాట్లాడుతూ.. రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీల్లో ప్రథమ స్థానం నిలిచిన దివ్యశ్రీ అండర్ -14 విభాగంలో జార్ఖండ్ రాష్ట్రంలోని రాంచిలో నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ చాటి 'స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా' వారు ప్రశంసా పత్రం అందజేసినట్లు తెలిపారు. ఈ సర్టిఫికెట్ ద్వారా విద్యార్థినికి ఉన్నత చదువులు, ఉద్యోగ అవకాశాల్లో రిజర్వేషన్ ఉంటుందన్నారు.

విద్యార్థులకు పౌష్టికాహారం అందించండి

● గిరిజన విద్యార్థులకు నెలకోసారి చికెన్ పెట్టడం లేదు
● రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయప్రతాప్‌రెడ్డి



అంగన్‌వాడీ సెంటర్‌లో రికార్డులు పరిశీలిస్తున్న విజయప్రతాప్‌రెడ్డి

శ్రీశైలంప్రాజెక్ట్: గిరిజన గురుకులాల విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ ప్రతాప్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సున్నిపెంటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, పౌరసరఫరాల గోదాము, గిరిజన గురుకుల పాఠశాలలను తనిఖీ చేశారు. ప్రైవేటు కాంట్రాక్టర్ల సరఫరాకు, గిరిజన కో– ఆపరేటివ్ సొసైటీ వస్తువుల సరఫరా ధరలో వ్యత్యాసం ఉండడంతో విద్యార్థులకు అందించే మెనూలో కొంత సర్దుబాట్లు చేసుకోవలసిన అవసరాలు తప్పడం లేదని వార్డెన్లు, ప్రిన్సిపాళ్లు ఆయన దృష్టికి తెచ్చారు. అలాగే వంట–వార్పునకు తగిన సిబ్బంది లేరని తెలిపారు. సమస్యలు ఎన్ని ఉన్నప్పటికీ జి.ఓ.నెం.8 ప్రకారం విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందజేయకపోతే శాఖా పరమైన చర్యలు తప్పవని విజయప్రతాప్‌రెడ్డి హెచ్చరించారు. గిరిజన గురుకుల పాఠశాలల్లో రాష్ట్రవ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొందని, వీటిపై ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామన్నారు. సున్నిపెంట గిరిజన గురుకుల విద్యాలయాలలో విద్యార్థులకు సరైన భోజనం అందించడం లేదని, చికెన్ వారానికి రెండు సార్లు పెట్టాల్సి ఉండగా, నెలకు ఒకసారి కూడా విద్యార్థులకు అందించడం లేదని, పెరుగు కూడా అందించని దుస్థితిని ఎందుకు ఏర్పడిందని మండిపడ్డారు. విద్యార్థులకు అందించాల్సిన భోజన పరిమాణం, నాణ్యతలో ఏ మాత్రం తేడా వచ్చినా సహించేది లేదన్నారు. ఈ మేరకు రెండు గిరిజన గురుకుల పాఠశాలల ప్రిన్సిపాళ్లు, వార్డన్‌లపై చర్యలకు ఆదేశిస్తున్నట్లు తెలిపారు. అంగన్‌వాడీ సెంటర్లను తనిఖీ చేసి గర్భిణులు, బాలింతలతో నేరుగా ఆయన ఫోన్‌లో మాట్లాడి కోడిగుడ్లు, పాలు ఎంత ఇస్తున్నారని ఆరా తీశారు. పౌరసరఫరాల గోదాములను తనిఖీ చేసి స్టాక్ పాయింట్‌లో డీలర్లకు తూకాలు వేసి నిత్యావసరాలు అందించాలని ఆదేశించారు.



కొక్కెం గుచ్చుకుని చిన్న రథాన్ని లాగుతున్న భక్తుడు



శూలాలు గుచ్చుకొని ఊరేగింపులో పాల్గొన్న తమిళ భక్తులు

ఉప్పొంగిన భక్తి భావం

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి రథోత్సవం కనుల పండువగా సాగింది. శుక్రవారం తమిళ భక్తులతో పాటు స్థానికులు పాత ఆంజినేయ స్వామి ఆలయంలోని శమీవృక్షం నుంచి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం వరకు రథోత్సవాన్ని నిర్వహించారు. తమిళ భక్తులు కావళ్లతో, నోటికి శూలాలు గుచ్చుకుని రథోత్సవంలో పాల్గొన్నారు. వీపునకు కొక్కాలు గుచ్చుకుని రథాన్ని లాగి భక్తిని చాటారు. మధ్యాహ్నం స్వామి వారికి అభిషేకం, భస్మ పూజ, మహామంగళ హారతి, సహస్ర పుష్పార్చన, ప్రసాద వినియోగ కార్యక్రమాలతో పూజా కార్యక్రమాలు చేశారు. సాయంత్రం స్వామి వారి పల్లకీ సేవతో ఊరేగింపు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త యాజీ కేశవర్ధన ఆధ్వ ర్యంలో నిర్వహించిన ఈ రథోత్సవంలో కార్యనిర్వాహ కులు, తమిళ భక్తులు,పెద్దలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



కావళ్లతో తమిళ భక్తుల నృత్యం



పూర్ణకుంభాలతో మహిళలు